ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు దూసుకొస్తున్న ప్రజానీకం

కాలుష్య కారక అదాని సిమెంట్‌పై

తిరుగుబాటు

- పెల్లుబికిన జనాగ్రహం
- టెంట్లు పీకేసి, కుర్చీలు విసిరేసి.. నిరసన గళం
- అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించిన ప్రజానీకం
- మిన్నంటిన అదానీ గో బ్యాక్ నినాదాలు
- ప్రజాభిప్రాయ సేకరణ తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

పెదగంట్యాడ ప్రాంతంలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలు బుధవారం పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. 'అదాని గో బ్యాక్.... కాలుష్య సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టొద్దు... మా ప్రాణాలు తీయొద్దు' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ప్రభుత్వ, పోలీసు బెదిరింపులకు వెరవక వేలాదిగా తరలొచ్చి తమ నిరసన గళం వినిపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సాగిన ఈ ఉద్ధృత ఆందోళనలతో అధికారులు వెనక్కుతగ్గారు. ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేశారు.

పెదగంట్యాడ ప్రాంతంలో 20 ఎకరాల్లో జనావాసాల నడుమ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టేందుకు బుధవారం ఉదయం పెదగంట్యాడ ఏరియాలోని నడుపూరు జెడ్‌పి హైస్కూల్‌లో జిల్లా అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేసింది. జెసి మయూర్ అశోక్ సహ పలువురు అధికారులు ఇక్కడకు రానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఉదయానికే నడుపూరు, బర్మా కాలనీ, హెచ్‌బి.కాలనీ, నెల్లిముక్కు, పెదగంట్యాడ, బాలచెరువు, అయ్యన్నపాలెం, గంగవరం, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజానీకం ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. బారికేడ్లను తోసేసి, వేదికపైకి చేరుకున్నారు. టెంట్లను, కుర్చీలను విసిరేశారు. పబ్లిక్ హియరింగ్ జరగకుండా అడ్డుకున్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రజాభిప్రాయ సేకరణ ప్రదేశానికి రాకుండా దూరం నుంచే పరిస్థితిని గమనించి వెనుతిరిగారు. ఆర్‌డిఒ శ్రీలేఖ వచ్చినప్పటికీ మహిళలంతా పెద్ద సంఖ్యలో ఆమెతో వాగ్వాదానికి దిగారు. ఫ్యాక్టరీపై ముందుకెళ్తే సహించేది లేదని మిగతా 2లో..



వేదికను పెకిలిస్తూ..



కుర్చీలను విసిరేస్తూ..



టెన్షన్.. టెన్షన్

- నేటి జగన్ పర్యటనపై ఉత్కంఠ

- షరతులతో కూడిన అనుమతులు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : ఉమ్మడి విశాఖలో మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్ గురువారం పర్యటించనున్న నేపథ్యంలో హైటెన్షన్ నెలకొంది. అనకాపల్లి జిల్లాలో వారం రోజులుగా ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఎన్నికలు తరువాత వైసిపి కార్యకర్తల్లో నిరాశ అలుముకుంది. తాజాగా జగన్ పర్యటన నేపథ్యంలో వారంతా జోష్ మీద ఉన్నారు. జగన్ పర్యటనకు అనుమతి లేదని మంగళవారం వరకూ చెప్పుకొచ్చిన అధికారులు గురువారానికి షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. ఆ ప్రకారం.. రోడ్డు మార్గాన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వద్దనున్న మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలించేందుకు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేస్తున్నట్టు విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు మిగతా 2లో..

వసతి గృహాలు, పాఠశాలల్లో లోపాలు లేకుండా చూడాలి

వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే

వార్త 2లో..

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

వార్త 7లో..



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న భారత క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్

మహిళా ప్రపంచ కప్ పోటీలకు

సర్వం సిద్ధం

నేడు విశాఖ వేదికగా దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిష్టాత్మకమైన ఐసిసి మహిళా ప్రపంచకప్ - 2025 పోటీలకు విశాఖ సిద్ధమైంది. నగరంలోని ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో గురువారం జరగనున్న మ్యాచ్‌లో భారత్ - దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన భారత జట్టు రెట్టించిన ఉత్సాహంతో బరిలో దిగుతుండగా దక్షిణాఫ్రికా జట్టు ఆడిన రెండు మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక పరాజయం నమోదు చేసి ఈసారి విజయమే లక్ష్యంగా సమరానికి సై అంటోంది. మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ ప్రపంచకప్‌లో విశాఖ వేదికగా ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. గురువారం నాటి మ్యాచ్‌కు సుమారు 28 వేల మంది హాజరయ్యే అవకాశముంది. ఇప్పటికే భద్రత, పార్కింగ్, మంచినీరు, తదితర సదుపాయాలన్నీ కల్పించారు. విద్యుత్ అంతరాయం లేకుండా బలమైన బ్యాకప్ వ్యవస్థను సిద్ధం చేశారు. ఇటీవలే స్టేడియంలో రూ.46 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టారు.

విజయంపై ఎవరి ధీమా వారిది..

బుధవారం సాయంత్రం ఎసిఎ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భారత జట్టు క్రీడాకారిణి జెమిమా రోడ్రిగ్స్ మాట్లాడుతూ విశాఖ మైదానం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, 270కి పైగా పరుగులు సాధిస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. తమ జట్టు అన్ని విభాగాల్లో మెరుగ్గా ఉందని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికా తరపున మీడియా సమావేశంలో పాల్గొన్న నాడిన్ డి క్లెర్క్ మాట్లాడుతూ భారత ఉపఖండ మిగతా 2లో..

బల్క్‌డ్రగ్ పార్కు వ్యతిరేక ఉద్యమంపై

నిర్బంధం దారుణం

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం దారుణమని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం అనకాపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొరబాబు మాట్లాడుతూ రాజయ్యపేట వద్ద 1270 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని ఆగస్టు 6న ప్రజాభిప్రాయ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందన్నారు. దీనిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన పనులు నిర్వహిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా 25 రోజులుగా రాజయ్యపేట మత్స్యకారులు శాంతియుతంగా పోరాటం చేస్తున్నారన్నారు. దాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. రాజయ్యపేట గ్రామం చుట్టూ పోలీసు వలయాన్ని ఏర్పాటు చేసి ఆంక్షలు విధిస్తోందన్నారు. గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, కేసులు పెట్టి అప్రజాస్వామిక పద్ధతులకు పూనుకుంటోందని మండిపడ్డారు. రాజయ్యపేట గ్రామాన్ని హోం శాఖ మంత్రి అనిత పర్యటించినప్పుడు గ్రామంలోని ప్రజానీకమంతా పార్టీలకు అతీతంగా బల్క్‌డ్రగ్ పనులు తక్షణం నిలిపివేయాలని, అనుమతులు ఇవ్వొద్దని కోరారన్నారు. ఆమె నుంచి ఎటువంటి స్పందనా రాకపోవడంతో కాన్వాయ్‌ను కూడా అడ్డగించారన్నారు. ఇప్పటికే హెటిరో డ్రగ్ పరిశ్రమ కాలుష్యం వల్ల తాము ఎలాంటి బాధలు పడుతున్నామో తెలిపారన్నారు. అయినప్పటికీ మంత్రి స్పష్టంగా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. మత్స్యకారులు మిగతా 2లో..



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మొదటి పేజీ తరువాయి..

టెన్షన్.. టెన్షన్

జగన్ విశాఖ విమానాశ్రయం నుంచి ఎన్ఎడి, పెందుర్తి, సరిపల్లి, అనకాపల్లి, తాళ్లపాలెం మీదుగా మాకవరపాలెం చేరుకోవాలని సూచించారు. రూట్ మళ్లింపునకు, జన సమీకరణ, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. జగన్ వాహన శ్రేణికి సంబంధించి పది వాహనాలకు అనుమతి ఇస్తున్నామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించడంలో విఫలమైతే వెంటనే అనుమతి రద్దు చేస్తామని, సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఏదైనా గాయం, ప్రాణనష్టం లేదా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తికి జరిగే నష్టానికి నిర్వాహకుడే వ్యక్తిగతంగా, పరోక్షంగా బాధ్యత వహించాలని విశాఖ సిపి స్పష్టం చేశారు.

వివాదం ఏంటి ?

మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పిపిపికి ఇవ్వడాన్ని వైసిపి వ్యతిరేకిస్తోంది. దీంతో కొంతకాలంగా రాష్ట్రంలో తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. మెడికల్ కాలేజీలు అసలు నిర్మాణమే జరగలేదని కూటమి నేతలు వాదిస్తుంటే.. అబద్ధాలతో ప్రజలను మభ్యపెడితే సహించేది లేదని వైసిపి నేతలు అంటున్నారు. ఈ క్రమంలో కూటమి, వైసిపి నాయకుల మెడికల్ కళాశాలల పర్యటనలు క్షేత్రస్థాయిలో జరిగాయి. ఇదిలా ఉండగా నర్సీపట్నం ఎమ్మెల్యే, శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాకవరపాలెం మెడికల్ కాలేజీ నిర్మాణంపై వివాదానికి ఆజ్యం పోశారు. అసలు అక్కడ కాలేజీయే లేదని, దమ్ముంటే రమ్మని సవాల్ విసిరారు. అది కాస్తా.. వైసిపి అధినేత జగన్ పర్యటనకు దారితీసింది. ఆయన పర్యటనను అడ్డుకుంటామని టిడిపి, జయప్రదం చేస్తామని వైసిపి నేతలు పోటాపోటీగా ప్రకటనలు ఇస్తుండటంతో టెన్షన్ వాతావారణం నెలకొంది.

సర్వం సిద్ధం

వాతావరణం చాలా వైవిధ్యంగా ఉందని తెలిపారు. భారత్‌ను ఎదుర్కొనేందుకు తమ వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని ఆమె తెలిపారు

టికెట్ల ధరలు ఇలా..

టికెట్లు ఇప్పటికే బుక్ మై షో యాప్ ద్వారా విక్రయిస్తున్నారు. 9న జరిగే తొలి మ్యాచ్‌కు, 13, 16, 26 తేదీలలో జరిగే మ్యాచ్‌లకు కనీస టికెట్ ధరను రూ.100గా నిర్ణయించారు. 12న హోరాహోరీగా సాగుతుందని భావిస్తున్న ఇండియా - ఆస్ట్రేలియా మ్యాచ్‌కు మాత్రం కనీస టికెట్ ధరను రూ.150గా ప్రకటించారు.

బల్క్‌డ్రగ్ పార్కు వ్యతిరేక ఉద్యమంపై నిర్బంధం దారుణం

చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలియజేయడానికి వెళ్తున్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బిసివై పార్టీల రాష్ట్ర నాయకత్వాన్ని సైతం అనుమతించడం లేదని, ఇది అప్రజాస్వామిక చర్యని అన్నారు. రాజయ్యపేటలో మోహరించిన పోలీస్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో ఆమ్‌ఆద్మీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, బిఎస్‌పి జిల్లా నాయకులు మాణిక్యాలరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యన్నారాయణ, ఆర్.శంకరరావు, నిర్వాసితుల సంఘం నాయకులు ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, టి.వెంకటరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, సదాశివరావు, కె.సోమునాయుడు పాల్గొన్నారు.

వసతి గృహాలు, పాఠశాలల్లో లోపాలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఇటీవల కురుపాం గురుకుల పాఠశాల వసతిగృహంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. ఆయా మండల, జోనల్ ప్రత్యేకాధికారులు వసతిగృహాలను,పాఠశాలలను సందర్శించా లని, అక్కడి పరిస్థితులను పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. బుధవారం సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. తాగునీటి పైప్‌లైన్లు, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల పైపులను పరిశీలించాలని, ఎక్కడైనా లోపాలుంటే సరిచేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్‌వ్యాధుల పట్ల అందరినీ అప్రమత్తం చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మెడికల్ రిప్స్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాలు బుధవారం జరిగాయి. కలెక్టరేట్‌కు సమీపంలో అఫీషియల్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ పతాకాన్ని ఆవిష్కరించారు. సహాయ కార్యదర్శి వర్మ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశంలోనే మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి యూనియన్ ఉందన్నా రు.1945లో రాజమండ్రిలో యూనియన్ మొదలైందని గుర్తు చేశారు. మొత్తం లక్షా 20వేల మంది సభ్యత్వం కలిగిన పెద్ద యూనియన్‌గా ఆయుర్భవించినద న్నారు. కార్యక్రమంలో కోశాధికారి రామారావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌తో పాటు, సేల్స్ రిప్రజెంటేటివ్స్ కూడా హాజరయ్యారని తెలిపారు

కాలుష్య కారక అదాని సిమెంట్‌పై / తిరుగుబాటు

(మొదటి పేజీ తరువాయి..) స్పష్టం చేశారు.

సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయండి : సిపిఎం

కాలుష్య కారక అదానీ సిమెంట్ ఫ్యాక్టరీని తక్షణం రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా పెదగంట్యాడలో ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమైన నేపథ్యంలో ప్రజలు తిరుగుబాబు చేశారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ తమకు వద్దే వద్దని, తమకు స్వచ్ఛమైన నీరు, గాలి, భూమి, పర్యావరణం కావాలని వేలాది మంది నినదించారని చెప్పారు. తమ ప్రాణాలకు, ఆరోగ్యాలకు ప్రమాదం తెస్తే ఖబడ్దార్ అంటూ పబ్లిక్ హియరింగ్ కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను, ఏర్పాట్లను నేలకూల్చేశారన్నారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసులను మోహరించినా, యువత మహిళలు, స్థానిక ప్రజలు తిరుగుబాటుతో ప్రభుత్వ యత్నాలు సాగలేదన్నారు. ప్రజాగ్రహంతో పబ్లిక్ హియరింగ్ రద్దయిందన్నారు. ఇప్పటికైనా టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని గుర్తించి, జనావాసాల నడుమ పెదగంట్యాడ వద్ద అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహం ఎదుర్కోక తప్పదని జగ్గునాయుడు హెచ్చరించారు.

హోరెత్తిన ఆందోళనలు

ప్రజాభిప్రాయ సేకరణ స్థలం వద్దకు సిపిఎం, సిపిఐ, జనసేన, వైసిపి నాయకులు, స్వచ్ఛందంగా ప్రజలు చేరుకుని ఆందోళనను తీవ్రతరం చేశారు. తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు ఎం.రాంబాబు, ఎన్.రామారావు, కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, కార్మిక నాయకులు అయోధ్యరామ్, ఎం.శ్రీదేవి, ఎల్.బంగారు నాయుడు, కామేశ్వరి జనంతో కలిసి వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకునేందుకు చూసినా ఫలితం లేకపోయింది. గేట్లును తోసుకుంటూ వారంతా ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు చేరుకున్నారు. తమ నిరసనను తెలిపారు. కుమార్‌ను పోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లారు. తుదకు ఆర్‌డిఒ, పెదగంట్యాడ తహశీల్దార్, పొల్యూషన్ అధికారి సహా పలువురు అధికారులు ప్రజాందోళనతో అక్కడి నుంచి నిష్క్రమించారు. జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజులు, వైసిపి మహిళా అధ్యక్షురాలు పల్లా చిన్నతల్లి, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు, స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, జన విజ్ఞాన వేదిక నాయకులు పాలూరు లక్ష్మణస్వామి, ఎస్‌వికె.పరుశురాం, త్రినాధస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా కుట్రలు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు అడ్డగించడంతో అధికారులు వెనుదిరిగారు. ప్రజలూ వారి ఇళ్లకు వారు వెళ్లారు. అయితే, సాయంత్రం నాలుగు గంటలకు నగర పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ కోసం సిద్ధమయ్యారు. న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్, పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయంలో ఉండి ఆలోచనలు చేశారు. పెదగంట్యాడ ప్రాంతంలోని రహదారులపై పోలీసులను మోహరించారు. ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళనలో పాల్గొంటున్న 15 మందిని అరెస్టు చేసి స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. నడుపూరు హైస్కూల్ వద్ద తాత్కాలిక టెంట్ వేశారు. ఆరు గంటల వరకు ఏదో ఒక విధంగా పబ్లిక్ హియరింగ్ జరపాలని ప్రయత్నాలు చేశారు. మరింత ముందుకెళ్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని, అది దేనికైనా దారి తీస్తుందని అందిన అంచనాలతో ప్రజాభిప్రాయ సేకరణను తాత్కాలికంగా రెండు వారాలపాటు వాయిదా వేస్తున్నట్టు జెసి తెలిపారు.



ఆర్‌డిఒను చుట్టుముట్టిన ఆందోళనకారులు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఆర్యవైశ్య యువజన సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి సహకారంతో బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద 'వాసవి భవన్'లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు నేతి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఒకసారి ఒక వ్యక్తి రక్తదానం చేస్తే ముగ్గురు వ్యక్తులను ప్రాణాపాయం నుండి కాపాడిన వారవుతారన్నారు. సంఘం కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ సేకరించిన రక్తం ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటి ద్వారా పేద పేషెంట్లకు సరఫరా చేస్తారన్నారు. 127 పర్యాయాలు రక్తదానం చేసి 128వ పర్యాయం రక్తదానం చేయడానికి వచ్చిన వంకాయల జవహర్ కార్యక్రమానికి చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎస్.కె.ఎల్.రావు, ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు రామకృష్ణ, శ్రీనివాసరావు, జగన్, సన్యాసిశెట్టి, సత్యనారాయణ, కందుల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే..

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ వల్ల స్టీల్‌ప్లాంట్ లాభాలబాట పట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం శుద్ధ అబద్ధమని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం 1654వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్యాకేజీగా ఇచ్చిన సొమ్మును స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన వాటికి ఖర్చు చేయటం లేదన్నారు. బ్యాంకుల రుణాలు తీర్చడానికి, జిఎస్‌టి బకాయిలు తీర్చడానికి వినియోగించారని చెప్పారు. ఈ వాస్తవాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు కంచరపాలెంజోన్ అధ్యక్షులు ఎస్.శ్రావణ్ కుమార్, ఎన్.ప్రకాశరావు, శ్రీనివాసరావు, లక్ష్మీపతి,ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతిని ప్రభుత్వ హత్యగా భావించాలి

- మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్: కురుపాం గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థులకు సంబంధించి వాటిని ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలుగా భావించాలని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర నాయకురాలు పాముల పుష్ప శ్రీవాణి ఆరోపించారు. బుధవారం వైసిపి నాయకులు అరకు ఎంపి గుమ్మా తనూజరాణి, పుష్ప శ్రీవాణి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా పుష్ప శ్రీవాణి మీడియాతో మాట్లాడుతూ, ఆహారం, మంచినీరు కాలుష్యం వల్ల విద్యార్థులకు వైరస్ సోకినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. గురుకుల పాఠశాలలో కనీసం తాగునీరు క్లోరినేషన్ కూడా చేయటం లేదన్నారు. కెజిహెచ్‌లో ఆక్సిజన్ పెట్టకపోవడం వల్లనే కల్పన అనే బాలిక చనిపోయిందన్నారు. రాష్ట్రంలో ఏ పాఠశాలలో కూడా ఆర్‌ఓ ప్లాంట్‌లు పనిచేయడం లేదన్నారు. గురువారం జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నం వస్తున్నారని తెలిసి, వ్యాధి తగ్గకపోయినా పిల్లలను బుధవారం డిశ్చార్జి చేశారన్నారు. ఎంపి డాక్టర్ గుమ్మ తనుజారాణి మాట్లాడుతూ 170 మంది గిరిజన బాలికలు హెపటైటిస్ సోకి అనారోగ్యం బారిన పడ్డారన్నారు మాజీమంత్రి అప్పలరాజు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతలేక ఈ వ్యాధి వచ్చిందని గిరిజన మంత్రి చెప్పడం శోచనీయం అన్నారు.

జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు ప్రారంభం


ప్రజాశక్తి- మధురవాడ : న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గత ఐదేళ్లగా జాతీయ స్థాయిలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి పేరుతో నిర్వహిస్తున్న మూట్ కోర్టు పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. గీతం స్కూల్ ఆఫ్ లా మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో జరగనున్న ఈ పోటీలను అసోం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కెవిఎస్.శర్మ ప్రారంభించారు. న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులు, సమకాలీన సాంకేతిక పరిజ్ఞానం, విలువలు, రాజ్యాంగం పట్ల పూర్తి అవగాహనతో విద్యార్థులు న్యాయవాద వృత్తిలో ఎదగాలని సూచించారు. మూట్‌కోర్టుల ద్వారా న్యాయ విద్యార్థులలో వృత్తి నైపుణ్యాలు, లోతైన అవగాహన, వాదన పటిమ పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. న్యాయవాద వృత్తిలో వ్యక్తిగత అభిప్రాయాల కంటే వాస్తవాలు, నైతిక విలువలు, వాదనలను సమర్థంగా న్యాయమూర్తుల ముందు వినిపించ గలిగిన సమర్థత అవసరమని తెలిపారు.

గీతం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవ్యాది వి.రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ, న్యాయవాది వృత్తిలో ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, వాదోపవాదాలపై న్యాయస్థానంలో ప్రవేశించే యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.

గీతం న్యాయ కళాశాల డైరక్టర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మణరావు మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో పాటించాల్సిన మెళకువలుపై ముఖ్యంగా ఎన్‌డిపిఎస్ కేసులలో ఎదురవుతున్న న్యాయపరమైన సవాళ్లు, క్రిమినల్ లా ఆధారంగా ఈ ఏడాది మూట్ కోర్టు పోటీల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తామని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 40 మందికి పైగా న్యాయ విద్యార్థులతో కూడిన జట్లు ఈ పోటీలలో పాల్గొనున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమానికి గీతం న్యాయ కళాశాల సహాయ ప్రొఫెసర్లు ఎల్.ఆశిష్ కుమార్, లక్ష్మి జగన్నాథ్, చిత్ర సక్సేనా సంధానకర్తలుగా వ్యవహరించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఆరిలోవ : వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని, వాటిని మన కుటుంబంలో భాగం అని భావించినప్పుడు వాటి మనుగడకు ముప్పు వాటిల్లదని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బిఎం.దివాన్ మైదిన్ అన్నారు. జూ పార్కులో బుధవారం జరిగిన వన్యప్రాణ సప్తాహ వేడుకలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, వణ్య ప్రాణుల మనుగడకు నష్టం వాటిల్లితే మానవాళికి కూడా ఎంతో నష్టమని గుర్తు చేశారు. అటవీ శాఖ రీజినల్ హెడ్ బి.బాలాజి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే పిల్లలు పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించుకోవాలని కోరారు. జూక్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఈ సప్తాహ వేడుకల్లో విశాఖ నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చిత్రలేఖనం పోటీలో ప్రథమ బహుమతి సాధించిన కంచరపాలెం కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని కవిషా దుర్గాకు, ఇతర విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.



సూర్యప్రకాష్‌ను అభినందిస్తున్న నాయకులు

నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా సూర్యప్రకాష్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి మధురవాడకు చెందిన నాగోతి సూర్యప్రకాశరావు నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ, భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ హాజరై చైర్మన్ తిరుమలేసు, డైరెక్టర్లు నాగోతి సూర్య ప్రకాశరావు, పోతిన పైడిరాజు (చిన్ని), బాలు, నాగోతి అనిత తదితరులను అభినందించారు. ఈ సందర్భంగా నాగోతి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాగోతి సూర్యప్రకాష్‌కు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, పిల్లా వెంకటరావు, నాగోతి నరసింహ నాయుడు, నాగోతి సత్యనారాయణ, పోతిన ప్రసాదు, బైపిల్ల పైడిరాజు, పోతిన ఎల్లంనాయుడు, గొల్లంగి ఆనంద్ బాబు, పిల్లా మోహన్‌కృష్ణ, నాగోతి శివాజీ, నాగోతి వెంకట్‌ఆనంద్ అభినందనలు తెలిపారు.

పైడిరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి - విశాఖపట్నం : గుండెపోటుతో ఇటీవల మృతిచెందిన ప్రజాశక్తి విజయనగరం జిల్లా కొత్తవలస మండల విలేకరి జి.పైడిరాజుకు ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎడివిటి స్టేట్ జనరల్ మేనేజర్ వై.తిరుపాల్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఘన నివాళ్లర్పించారు. బుధవారం ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా విలేకరుల వర్క్‌షాప్ జరిగింది. తొలుత పైడిరాజు చిత్రపటానికి శర్మ పూలమాల వేశారు. అనంతరం సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. పైడిరాజు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన విలేకరిగా, డివిజన్ ఆర్గనైజర్‌గా చేసిన సేవలను స్మరించుకున్నారు.



పైడిరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంవిఎస్.శర్మ

చట్టానికి ఎవరూ అతీతులు కాదు

జగన్ టూర్‌పై గంటా

ప్రజాశక్తి-మధురవాడ : చట్టానికి ఎవరూ అతీతులు కాదని, వ్యవస్థలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనను ఉద్దేశించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఎంవిపి.కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 63 కిలోమీటర్ల పొడవున రోడ్డు మార్గంలో వెళ్తామంటే శాంతి భద్రతలకు విఘాతం కలగదా అని ప్రశ్నించారు. భద్రతా కారణాలరీత్యా నర్సీపట్నం పర్యటనకు హెలికాప్టర్‌లో వెళ్లాలని పోలీస్ యంత్రాంగం సూచిస్తే దాన్ని రాజకీయం చేయాలని జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ మహిళ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గురువారం ఉదయం విశాఖ వచ్చి సాయంత్రం 4.30 గంటలకు బెంగుళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయే వీకెండ్ పొలిటీషియన్‌గా జగన్‌ను అభివర్ణించారు. వైసిపి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటికి తాళాలు వేసినట్టు, చంద్రబాబును పరామర్శించేందుకు వెళ్తున్న పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నట్టు తామూ చేయగలమని, కానీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించే రాజకీయ పార్టీ కావడం వల్ల ఎవరి హక్కులనూ హరించే ఉద్దేశం తమకు లేదన్నారు.

అధికారంలో ఉన్న ఐదేళ్లలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పూర్తి చేయని జగన్మోహన్ రెడ్డి వాటిని పూర్తి చేయాలని ఇప్పుడు కోటి సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో ఏమాత్రం నిబద్ధత ఉన్నా రూ. 450 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టకుండా నర్సీపట్నం మెడికల్ కాలేజీ పూర్తి చేసి ఉండేవారని వ్యాఖ్యానించారు.

విశాఖ అభివృద్ధిని ఆపడానికి ఉత్తరాంధ్ర వైసిపి నాయకులు ఇటీవల పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాల్లో రహస్యంగా సమావేశం కావడం సిగ్గు చేటన్నారు. గూగుల్, బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ, అర్సెల్లాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమల భూ సేకరణ అడ్డుకోవాలని ఆ సమావేశంలో తీర్మానించారని ఆరోపించారు. వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలను అడ్డుకుని ఏం సాధిస్తారని, ఉత్తరాంధ్రపై చూపించే ప్రేమ ఇదేనా అని నిలదీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, చిక్కాల విజయ్ బాబు, గాడు అప్పలనాయుడు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గత నెల 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు వంకల సత్యం మృతి చెందిన నేపథ్యంలో అతని కుటుంబానికి యుటిఎఫ్ భీమిలి మండల కమిటీ బుధవారం రూ.1.10 లక్షలు సాయం అందజేసింది. జివిఎంసి నాలుగో వార్డు దిబ్బడిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్.రాయవరం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు సత్యం మృతి పట్ల యుటిఎఫ్ ప్రతినిధులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూనే బాధిత కుటుంబానికి ఆర్థికంగా సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్‌ఎ.శ్రీనివాసరావు, కోశాధికారి ఎ.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఆదయ్య, కోటేశ్వరరావు, బాలరాజు రెడ్డి, గొట్టిపల్లి సత్య నారాయణ, వి రాంబాబు తది తరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం చిగురువలసకు చెందిన బొగ్గు ప్రమీల పిఎం.పాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధంవుతోంది. దసరా నిమిత్తం గత నెల 27వ తేదీన ఇంటికి వెళ్లిన ప్రమీల తిరిగి వసతి గృహానికి రాలేదు. అప్పటి నుంచి ఆమె తండ్రి బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

గంజాయి నిందితునికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి- చోడవరం : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు ప్రగాఢ గణేష్‌కు పదేళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ, చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ బుధవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్లు అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మాడుగుల మండలం ముకుందాపురానికి చెందిన ప్రగడ గణేష్ 2015 నవంబర్ 11న 100 కేజీలు గంజాయి రవాణా చేస్తుండగా అప్పటి చోడవరం ఎస్ఐరమణయ్య సిబ్బందితో కలిసి చోడవరం, కొత్తూరు జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితుడు పాడేరు పరిసర ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి, మైదానప్రాంతంలో అమ్మకానికి కారులో తీసుకొస్తుండగా పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, దర్యాప్తు అనంతరం కోర్టులో నేరాభియోగపత్రాలు దాఖలు చేయగా, విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పుచెప్పారు. ప్రభుత్వ న్యాయవాది యు.వెంకటరావు వాదించారు.

పాముకాటుతో వార్డు సభ్యుడు మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో పైడంపేట గ్రామ పంచాయతీ ఏడో వార్డు సభ్యుడు గోగాడ సన్యాసినాయుడు(54) పాము కాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ నెల 6వ తేదీన సాయంత్రం 4గంటల సమయంలో తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా, గోగాడ సన్యాసినాయుడు పాము కాటుకు గురయ్యాడు. వైద్యం కోసం అతడిని కుటుంబ సభ్యులు కె.కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు ు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యంవిషమించడంతో బుధవారం ఉదయం 8గంటల సమయంలో సన్యాసినాయుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మెడికవర్‌లో ఉచితంగా రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - ఆరిలోవ : రొమ్ము కేన్సర్ అవగాహన నెలను పురస్కరించుకొని అరిలోవ హెల్త్ సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఒక నెలపాటు ఉచితంగా బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు రోగ నిరోధక ఆరోగ్య సేవలను విస్తరించడంలో మెడికవర్ తీసుకుంటున్న కృషిని అభినందించారు. మహిళల్లో కేన్సర్ మరణాలను తగ్గించడానికి ప్రారంభ దశలో గుర్తించడం, క్రమం తప్పని స్క్రీనింగ్, సమయానికి వైద్య చికిత్స ఎంత ముఖ్యమో ఆమె వివరించారు. చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రమావత్ దేవ్ మాట్లాడుతూ, కేన్సర్ నియంత్రణకు అవగాహన, సులభంగా లభ్యమయ్యే వైద్య సేవలు అత్యంత ప్రాధాన్యం కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహిత్య, డాక్టర్ కార్తీక్ చంద్ర, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ అభిలాష్, సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యంపై చురుకైన భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉచిత స్క్రీనింగ్ సేవలు ప్రతి సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ నెల రోజుల కార్యక్రమంలో ఆంకాలజిస్టుల సలహా సమావేశాలు, ఆరోగ్య అవగాహన చర్చలు, స్త్రీరోగ నిపుణులు, నర్సింగ్ బృందం, సామాజిక కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు దీనిలో భాగంగా ఉంటాయని వివరించారు.



రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వివిఎంఆర్‌డిఎ పరిధి కైలాసగిరి, ఉడాపార్కు, సెంట్రల్‌పార్కు తదితర చోట్ల గార్డెన్ కార్మికులుగా పనిచేస్తున్న 18 మంది కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించిందని, వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉడా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఉడా చర్యను వి.కృష్ణారావు ఖండించారు. కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉడా పరిధిలోని 7 సొసైటీల్లో సుమారు 250 మంది గార్డెన్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరెవరికీ కనీసం గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు, లేబర్ హాలీడేస్, రిటైర్మెంట్ సౌకర్యాలు ఏవీ అమలు కావడంలేదని తెలిపారు. ఉడాలో రూ.600 జీతం నుండి గత 35 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కార్మికులను 60 సంవత్సరాలు నిండిన కారణంగా 11మందిని తొలగించారన్నారు. మరో ఏడుగురిని సెలవులు పెట్టారనే నెపంతో తొలగించారని ఇది దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. వాస్తవంగా ఉడాలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నించడం వల్ల వీరిని తొలగించారని తెలిపారు.

సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులకే ఉద్యోగ భద్రత లేకుండా చేస్తే ప్రైవేట్, కాంట్రాక్ట్ సంస్థల్లో ఎలా భద్రత ఉంటుందని ప్రశ్నించారు. కార్మికులు తప్పుచేశారని ఉపాధిని తొలగించే శిక్షలు వేయడం సరికాదన్నారు. తక్షణమే కమిషనర్ చర్యలు జరిపి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు.



నిరసన తెలుపుతున్న గార్డెన్ కార్మికులు



విద్యార్థులకు ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

ఫిల్మ్ మేకింగ్ వర్క్ షాప్

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఒక రోజు ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్‌ను వైజాగ్ షార్ట్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించారు. వైజాగ్ షార్ట్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ కార్యదర్శి డైరెక్టర్ ఎల్లాజీ ఫిల్మ్ మేకింగ్‌లో ఉన్న 24 క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ప్రాజెక్ట్ వర్క్సును ఏవిధంగా చిత్రీకరించాలి, ఎడిటింగ్ చెయ్యాలి అనే అంశాలను వివరించారు. హీరో కుమార్ రాజు ఫిల్మ్ మేకింగ్ అంశాలపై సూచనలు, సలహాలిచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, చదువుతో పాటు ఇలాంటి యాక్టివిటీస్ నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగు పడుతుందన్నారు. ఈ వర్క్ షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్ తదితరులు

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా విద్యాశాఖాధికారి

ప్రజాశక్తి- ఆరిలోవ : జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి ప్రారంభించనున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెకుముకి పరీక్షను ఎక్కువ మంది విద్యార్థులు అన్ని పాఠశాలల్లో రాసేందుకు వీలుగా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులకు అనుగుణంగా పరీక్ష నిర్వహణకు జిల్లా విద్యాశాఖ సహకరిస్తుందని జెవివి ప్రతినిధులకు చెప్పారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి వైఎఆర్‌కె.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ పి.లక్ష్మణస్వామి, కార్యదర్శి ఎస్‌వికె.పరశురామ్, మండల విద్యాశాఖాధికారి పి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితునికి ఆర్థిక సాయం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వెన్నెముక శస్త్ర చికిత్స అనంతరం అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం తోటి స్నేహితుడు రమణకు స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, జి.సాయి తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న సుమిత్ర, ఆర్ఎన్.మాధవి, బొట్టా ఈశ్వరమ్మ

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీలలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్, సిపిఎం కంచరపాలెం జోన్ నాయకులు బొట్టా ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు జివిఎంసి 45వ వార్డు పరిధి ఎస్ఆర్.నగర్‌లో ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఐద్వా నగర అధ్యక్షులు ఆర్ఎన్.మాధవి, కంచరపాలెం కార్యదర్శి సిహెచ్.సుమిత్ర, సీనియర్ నాయకులు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రజలు, మహిళల తరపున పోరాడుతున్న తీస్తా సెతల్వాడ్ ఈ మహాసభలను ప్రారంభించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి 600 మంది ప్రతినిధులు హాజరవుతారని, 13వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలో మూడేళ్ల కాలంలో మహిళా ఉద్యమ అనుభవాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. మహిళలపై హింస, మద్యం, మత్తు పదార్థాలు, మహిళల ఉపాధి, తక్కువ వేతనాలు, మైక్రో ఫైనాన్స్, వడ్డీవ్యాపారం, పొదుపు పేరుతో దోపిడీ, పేదరికాన్ని పెంచే పి- 4 పథకాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితరాలపై తీర్మానాల కోసం లోతైన చర్చలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు లీలా, శోభ, గంగ, జ్యోతి, లక్ష్మి, ఆదిలక్ష్మి, పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, పి.గౌరీష్ పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : లారీ సప్లయర్స్, ఓనర్స్ సమస్యలను పరిష్కరించాలని విశాఖ ట్రాన్స్‌పోర్టు సప్లయర్స్ ఎలియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. విశాఖ పౌర గ్రంథాలయంలో బుధవారం విడిఎల్ఎస్ఎ ఐక్యవేదిక ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 40 ఏళ్లుగా విశాఖ జిల్లాలో 500 ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, ప్రత్యక్షంగా పరోక్షంగా 15,000 మందితో జీవనోపాధి సాగిస్తున్నామని వెల్లడించారు. తామంతా జెఎసిగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. బల్క్ మెటీరియల్స్‌పై ఒక శాతం మార్జిన్ అమలు చేయాలని కోరారు. లోడింగ్ అన్ లోడింగ్, రిసీవెడ్ చార్జీలు పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.భాస్కర్, కార్యదర్శి బి.సూర్యప్రకాశరావు, ట్రెజరర్ వి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.నరసింహారావు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఈటీ ప్రకాశరావు, యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ భార్గవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విడిఎల్ఎస్ఎ ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి కొయ్యపేట గ్రామంలో బుధవారం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లీలాప్రసాద్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీచేశారు. ఎంపిడిఒ కుంచాడ రూపేష్ శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలోని పారిశుధ్య పనులను కూడా పరిశీలించారు. తాగునీటి సమస్యలపై స్థానికులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, మురళి పాల్గొన్నారు.

పాలనా విధానంపై శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీలో ఉన్న సర్పంచులకు, ఎంపిటిసిలకు పరిపాలన విధానంపైనా పంచాయతీ అభివృద్ధిపైనా శిక్షణను బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. పరిపాలనపై ఇద్దరు శిక్షకులు అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-మధురవాడ : ఆంధ్రప్రదేశ్ ఆహార కమిటీ సభ్యులు బి.కాంతారావు, జిల్లా వెండ్ కమిటీ సభ్యులు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావుతో మధ్యాహ్న భోజనం క్వాంటిటీతో పాటు, గుడ్డు సైజ్, బరువు, స్టాంపింగ్‌ను పరిశీలించారు.

మద్దిలపేటలో పొలం బడి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం మద్దిలపేట గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో వరి సాగు అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగుమందుల వినియోగం, విత్తనం మొదలు పండిన పంట అమ్మే వరకు పాటించాల్సిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంబంధిత పరికరాలు, పని ముట్లుతో కూడిన కిట్లను ఎఇ బి.శివకోమలి రైతులకు అందజేశారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రమీల పాల్గొన్నారు.



కిట్లు అందుకున్న రైతులు


వేతన బకాయి చెల్లించాలని నిరసన



సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం ఇస్తున్న పంపు అపరేటర్లు

ప్రజాశక్తి- రాంబిల్లి : మూడేళ్లుగా వేతనాలు చెల్లించక మండలంలోని జెడ్.చింతవ పంచాయతీ లోవపాలెం, గజరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల పంప్ ఆపరేటర్లు అనేక అవస్థలు పడుతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడునాయుడు ఆరోపించారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడుతూ, పంప్ ఆపరేటర్ల సమస్యపై, అనేకసార్లు స్పెషలాఫీసర్, ఎంపిడిఓ, తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా వేతన బకాయిలు చెల్లింపునకు చర్యలు చేపట్టలేదన్నారు. పనిచేసిన కార్మికులకు మూడేళ్లుగా వేతనాలు ఇవ్వకపోతే, వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి, వేతన బకాయి చెల్లించాలని పంపు ఆపరేటర్లు గంగరాజు, కోదండమ్మ, రమణ కోరారు.

బెల్ట్‌షాపులను అరికట్టండి



మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి- కె. కోటపాడు : ఎక్సైజ్ అధికారులు నిద్ర మత్తువీడి, గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలు నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యర్రాదేముడు అధ్యక్షతన సిపిఎం మండల సమావేశం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారులు బరితెగింపునకు పూనుకుంటున్నారని, దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. దీన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మామ్ముళ్ల మత్తులో జోగుతున్నారని మండిపడ్డారు. బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అధికధరలకు గ్రామగ్రామాన బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు బాహాటంగా సాగుతుంటే, వీటన్నింటినీ అరికట్టామని ఎక్సైజ్ సిఐ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం కేటాయించిన లైసెన్స్ షాపులకు అనుబంధంగా చిన్న గ్రామాల్లో సైతం కిల్లీ షాపులు, టీ దుకాణాలు, దాబాల్లోనూ మద్యం అమ్మకాలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. ఎక్కడికక్కడే మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఆగడాలతో గ్రామాల్లో శాంతిభద్రతలు క్షీణించడంతోపాటు నేరాల రేటు పెరుగుతోందని, మహిళలు, బాలికలకు రక్షణ లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతుంటే, మద్యం సిండికేట్లు జేబులు నింపుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి, బెల్ట్ షాపులు నిరోధించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వి సూర్యనారాయణ, ఈర్లె నాయుడుబాబు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

చౌడువాడ, కొత్తకోట స్ఫూర్తితో
పిహెచ్‌సిలు పనిచేయాలి



స్వచ్ఛ అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-అనకాపల్లి : చౌడువాడ, కొత్తకోట పిహెచ్‌సి స్ఫూర్తితో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపించి మంచి పేరు తేవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జిల్లాలో చౌడువాడ పిహెచ్‌సికి రాష్ట్రస్థాయిలోనూ, కొత్తకోట పిహెచ్‌సికి జిల్లాస్థాయిలోనూ స్వచ్ఛాంధ్ర అవార్డు రావడం హర్షనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేయాలని, వచ్చే ఏడాదికి అన్ని పిహెచ్‌సిలు అవార్డులకు పోటీపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి, చౌడువాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె. మాలంనాయుడు, కొత్తకోట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కెఎం.సురేఖ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి -.అనకాపల్లి :స్థానిక జివిఎంసీ ఉన్నత పాఠశాల మెయిన్ (పెద్ద హైస్కూల్) లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విడి ప్రభాకరరావు తనయుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న, పాఠశాల పూర్వ విద్యార్థి, స్వతహాగా క్రికెట్ క్రీడాకారుడు వి.రాజేష్ రూ.25 వేల విలువైన 55 జతల స్పోర్ట్స్ డ్రెస్సులను బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించాలనే తపనతో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులైన ఎస్‌వి నరసింహం ద్వారా విద్యార్థులకు క్రీడా దుస్తులను బహూకరించానన్నారు. దాత వి.రాజేష్‌కు పాఠశాల, విద్యార్థుల తరపున ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

పరిశుభ్రత ప్రజా ఉద్యమం కావాలి

సిబిసి రాష్ట్ర డైరెక్టర్ రత్నాకర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి- అనకాపల్లి : పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం జరుగుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) డైరెక్టర్ పి.రత్నాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరిగిన 'స్వచ్ఛత' కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్తా చెదారం, బూజులను తొలగించారు. అనంతరరం మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకోవాలని, పారిశుద్ధ్యం మెరుగుదలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పేందుకుప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. రీసైక్లింగ్, పునర్వినియోగం, బయోమైనింగ్, బయోరిమిడియేషన్ ద్వారా పాత డంపింగ్ యార్డులను శుభ్రం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. స్వచ్ఛ కార్యక్రమాలను చేపట్టి, mygov/Appలో నమోదు చేసుకుని ఫొటోలను జతపరచడం ద్వారా సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. సమాజంలో పరిశుభ్రత పట్ల అవగాహన పెంపుదల, పౌరుల భాగస్వామ్యం, వ్యర్థ పదార్థాలు లేకుండా చేయడం స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలన్నారు. పనికి రాని వస్తువులు, వ్యర్థాలను తొలగించాలన్నారు. ప్రతి ఏటా 100 గంటలు లేదా ప్రతి వారానికి రెండు గంటలు శ్రమదానం చేసి పరిశుభ్రంగా ఉండే సంకల్పానికి ప్రతి ఒక్కరూ శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు, గ్రంథాలయ కోశాధికారి ఆడారి మోహనరావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్.ఎఫ్.ఐ.), ఎస్.ఎం.నాయుడు, ఆడారి గంగాధర్, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠకులు 'స్వచ్ఛత' ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

జగన్‌ను కలిసిన చెంగల



జగన్‌తో మాజీ ఎమ్మెల్యే వెంకటరావు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, వైసిసి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుని గా నియమితులైన చెంగల వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించిన జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుతో మత్స్యకారులకు కలిగే నష్టాలను, వారు చేస్తున్న ఉద్యమాన్ని జగన్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ నెల 9న మాకవరపాలెంలోని వైద్యకళాశాల భవనాల సందర్శనకు వస్తానని, తన వద్దకు పదేసి మంది బాధిత మత్స్యకారులు రైతులను తీసుకురావాలని జగన్ సూచించారని వెంకటరావు తెలిపారు.

తపాలా పొదుపు పథకాలపై ప్రచారం



బాండ్ పత్రాలను అందజేస్తున్న పోస్టల్ అధికారి

ప్రజాశక్తి- అచ్యుతాపురం :తపాలా పొదుపు పథకాలపై బుధవారం ఎర్రవరం, బయ్యవరం, అసకపల్లి, ఊడరు తదితర గ్రామాలలో ఇంటింటా పోస్టల్ సిబ్బంది విస్తృత ప్రచారం చేశారు. అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సిహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అనకాపల్లి సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేష్‌రావు ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పదేళ్లలోపు బాలికలను సుకన్య సమృద్ధి యోజన, ఇతర పొదుపు పథకాలలో చేర్పించారు. అంగన్వాడిలు, పాఠశాలలతోపాటు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ఈ పథకంపై వివరించారు. పలువురు అర్హులను పథకాల్లో చేర్పించారు.

పార్కు భవనం నిర్మాణంలో నాణ్యతా లోపం



తుది దశ నిర్మాణంలో పార్కు భవనం



నిర్మాణ దశలోనే ధ్వంసమైన ట్యాంకు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా విఎంఆర్‌డిఎ నిధులు రూ.50లక్షలతో చేపడుతున్న పార్క్ భవనం నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారం పనులు కొనసాగుతుండడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. పార్క్‌లో భాగంగా ట్యాంక్ నిర్మాణానికి చేసిన కట్టడాలు ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా ధ్వంసమైపోయాయి. బిల్డింగ్ గోడలు బలహీనంగా ఉన్నప్పటకీ, వాటికి నామమాత్రంగా పెయింటింగ్ వేసి, నిర్మాణం అయిందని పించుకోవాలని చూస్తున్న కాంట్రాక్టర్ నిర్వాకంపై స్థానికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదశలోనే ట్యాంకు పాడౌతుంటే, ఇది ఎన్నాళ్లు నిలుస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనాన్ని వృథా కాకుండా పార్కు భవనం పదికాలాలపాటు ఉండాలంటే నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తగు పర్యవేక్షణతో పనుల నాణ్యతను పరీక్షించి, కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బదిలీ ఉద్యోగికి వీడ్కోలు



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపిపి, ఎంపిడిఓ

ప్రజాశక్తి- సబ్బవరం: ఎంపిడిఓగా ఉద్యోగోన్నతి పొంది బుచ్చయ్య పేటకు బదిలీ అయిన స్థానిక మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.శివప్రసాద్ నారాయణరావుకు బుధవారం ఘనవీడ్కోలు లభించింది. స్థానిక ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, ఎంపిడిఓ పి. పద్మజ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సబ్బవరపు నారాయణమూర్తి, మామిడి శంకరరావు, బోను నాయుడు, దాడి లావణ్య కన్నంనాయుడు, పెతకంశెట్టి రామకోటి అప్పారావు, ఇఓపిఆర్‌డి చైతన్య, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం శివారు గ్రామంలో వీరాంజనేయస్వామి యూత్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పెందుర్తి వైసిపి నాయకులు గండి రవికుమార్ పాల్గొని అమ్మవారికి పూజలు చేసారు ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, గండి ముత్యాలనాయుడు, పైల రామునాయుడు, గండి సురేష్, మోహన్, సిరపరపు రమేష్, మహిళలు పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు అప్పలరాజు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : పాఠశాల విద్యార్థుల్లో 20శాతం మంది చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం, లెక్కలు చేయడం వంటి అంశాల్లో అభ్యసన వైకల్యంతో బాధపడుతుంటారని ప్రతేక ఉపాధ్యాయులు బి.అప్పలరాజు అన్నారు. అటువంటి వారికి చదువు నేర్పించడంపై ఇబ్బందులు ఎదుర్కొనే పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం సందర్భంగా దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, డిస్లెక్సియా అనేది మేధస్సుతో తెలివితేటలతో సంబంధం లేని ఒక న్యూరోలాజికల్ లెర్నింగ్ డిఫరెన్స్ అని, సరైన గుర్తింపు, తగిన సహకారంతో ఇటువంటి అభ్యసన వైకల్యం ఉన్న విద్యార్థులు కూడా సృజనాత్మక ఆలోచనకారులుగా ఎదగగలరన్నారు. ఈఏడాది 'డిస్లెక్సియాను అర్థం చేసుకోండి- ప్రతి మనసు విలువైనది' థీమ్‌తో అంతర్జాతీయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు ప్రీస్కూల్‌తోపాటు, ఎనిమిదేళ్ల వయస్సులోపునన పిల్లల్లో డిస్లెక్సియా సంకేతాలు కనిపిస్తాయన్నారు. క్రమబద్ధమైన ఫోనిక్స్-ఆధారిత బోధన' అనే నిర్దిష్ట పద్ధతిని ఉపయోగించి డిస్లెక్సిక్ పిల్లవాడికి చదవడం నేర్పించవచ్చన్నారు. దేశంలో పాఠశాల

బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రమాదవశాత్తు మరణించిన తుమ్మపాల గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల కార్యకర్త కొణతాల ఈశ్వర జగ్గప్పారావు కుటుంబానికి పార్టీ తరపున రూ.ఐదు లక్షల పరిహారం చెక్కును బుధవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలబడాలని జనసేన అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి పవన్ ⸍ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సిఫార్సులతో పరిహారం మంజూరైందన్నారు. ాార్యక్రమంలో తుమ్మపాల ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), జనసేన నాయకులు గంగుపాం జగదీష్, బంటు రవి, పీలా తాతు నాయుడు, పీలా విశ్వేశ్వరరావు, గాలి జగదీష్, చదరం చిన్న, రాపేటి రాంకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పరవాడ: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ హామీనిచ్చారు. బుధవారం తెల్లవారుజామున లంకెలపాలెం శివారు గొడ్డుపేట, ఎస్‌సి, బిసి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గొడ్డుపేటలో మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని, ఎస్‌సి కాలనీ నుంచి గొడ్డుపేట రహదారికి చుట్టుపక్కలా పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ, తవ్విన తాగునీటి పైపులైన్ గుంతలను పూడ్చాలని అధికారులకు సూచించారు. ఇంటింటా చెత్తసేకరణ చేపట్టి, పారిశుధ్యం క్షీణించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వార్డు సమస్యలపై కార్పొరేటర్ స్పందనపై గొడ్డుపేట గ్రామ పెద్దలు, ఎస్‌సి, బిసి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలోని దార్లపూడి మేజర్ పంచాయతీలో పరిసరాల పరిశుభ్రతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి మూర్తి ఆధ్వర్యంలో తడి మరియు పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు.కరపత్రాలను ఆవిష్కరించి, గోడలకు అంటించే కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు.కోరారు. గుర్రాజుపేట, తిమ్మాపురం గ్రామాల్లో ఎంపిడిఒ పి.మీనాకుమారి పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకట నరసింహమూర్తి.. గ్రామ సచివాలయం, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

ఉచిత ప్రయాణం సరే.. బస్సులేవీ..



భీమిలి నుంచి ప్రయాణికులతో కిక్కిరిసి బయల్దేరిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకునే పరిస్థితి కానరావడంలేదు. తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం నుంచి నేరుగా చారిత్రక ప్రాంతమైన భీమిలి వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సులే లేవు. కనీసం తగరపువలస వలస నుంచి భీమిలి వెళ్లేందుకు కూడా బస్సు సదుపాయం లేదు. నియోజకవర్గ కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే గ్రామీణ ప్రాంతాలకు బస్సు సదుపాయం కోసం వేరేగా ప్రస్తావించనక్కర లేదు.

అరకొరగా బస్ సర్వీసులు...

పలు గ్రామాలకు అరకొరగానే బస్ సర్వీసులు నడుస్తున్నాయి. మండలంలోని చిప్పాడ దివీస్ వరకు రోజుకు రెండు ట్రిప్పులు మాత్రమే ఆర్‌టిసి బస్సు నడుస్తోంది. అక్కడి నుంచి కొద్ది దూరంలో ఉన్న అన్నవరం, అక్కడి నుంచి మరో మత్స్యకార గ్రామమైన పెద నాగమయ్యపాలెం గ్రామానికి ఇదే బస్సు వెళ్ళుంటే ఉపయోగంగా ఉంటుందని అదే గ్రామానికి చెందిన మత్స్యకారులు, మహిళలు చెబుతున్నారు. అన్నవరం, పెదనాగమయ్యపాలెం మత్స్యకార గ్రామాలకు గతంలో తగరపువలస మీదుగా ఆర్‌టిసి నడిపిన కార్గో బస్ సర్వీసు ఉండేది. దీంతో అన్నవరం, పెద నాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెంలోని మత్స్యకార మహిళలు అదే బస్సులో తట్టల్లో చేపలు వేసుకుని తగరపువలస, అవసరాన్ని బట్టి ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లి చేపలు అమ్మేవారు. చేపలు దొరికిన చోట అమ్మితే సహజంగా గిట్టు బాటు ధర లభించదన్న కారణంతో కార్గో బస్సులో రాను పోను ఛార్జీలు తక్కువే గనుక చేపలు అమ్మేందుకు అలా వెళ్లి ఇలా సొంతూళ్లకు క్షేమంగా చేరుకునే వారు. ఇదంతా పదేళ్ల క్రితం సంగతులు. ఇప్పుడేమో అటు వైపు ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడపడం లేనే లేదు. అప్పట్లో పలానా రూట్‌లో నష్టం వస్తుంది. అందుకే సర్వీసులు నడపలేం అనేది ఆర్‌టిసి అధికారుల నుంచి తరచూ వినిపించే వాదన. ఆర్‌టిసి అనేది ప్రభుత్వ రంగ సంస్థ. ఒక రూట్‌లో లాభం రావొచ్చు, ఇంకో రూట్‌లో నష్టం రావొచ్చు. లాభ నష్టాలతో బేరీజు వేసుకోకూడదు.

ఇప్పుడు ఎలాగూ మహిళలకు ప్రయాణం ఉచితం గనుక ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఆయా గ్రామాలను కలుపుతూ ఆర్‌టిసి బస్సు సర్వీసులు పునరుద్ధరించవచ్చు. ఇదే మండలంలోని తాటితూరు గ్రామానికి గతంలో ఆర్‌టిసి బస్సు సర్వీసు ఉండేది. ఎందుకనో అర్థాంతరంగా నిలిపివేశారు. అమనాం గ్రామానికి కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే ఆర్‌టిసి బస్సు సర్వీసు నడుస్తోంది.


కిక్కిరిసి ప్రయాణం...

ప్రస్తుతం ఏ రూట్‌లో చూసినా బస్సులో కిక్కిరిసి ప్రయాణం చేస్తుండడం కనిపిస్తుంది. ఒకప్పుడు పండగ వేళల్లోనే జనంతో కిక్కిరిసి బస్సులు నడిచేవి. ఇప్పుడు రోజూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఆర్‌టిసి బస్సులో 45 మంది కూర్చుని ప్రయాణించేలా సీట్లు ఉంటాయి. నిల్చుని మరో 30 మంది ప్రయాణించవచ్చు. ఇప్పుడేమో పరిమితికి మించి ప్రయాణికులతో బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం తగరపువలస నుంచి అనకాపల్లి సింగిల్ ట్రిప్పు ఒక వైపు ఏకంగా 170 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. భీమిలి నుంచి దొరతోట మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు 45 మంది సీట్లలో కూర్చుంటే మరో 70 నుంచి 80 మంది లోపల నిల్చొని, ఫుట్ బోర్డుపై మరికొందరు నిల్చొని ప్రయాణిస్తున్నారు.

ఒత్తిడికి గురవుతున్న డ్రైవర్లు, కండక్టర్లు

బస్సు ప్రవేశ ద్వారం వద్ద వేలాడుతూ ప్రయాణికులు ఉండటంతో కొన్ని సందర్భాల్లో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రవేశ ద్వారం వద్ద వేలాడటం వల్ల ఇబ్బందిగా ఉందని పలువురు డ్రైవర్లు, కండక్టర్లు వాపోతున్నారు.

జగన్ పర్యటనపై ఆంక్షలు తగవు!



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణం నిలిపివేయడమే కాకుండా, వాటిని ప్రైవేటుపరం చేయడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మాకవరపాలెం, భీమపోయినపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను అడ్డుకోవాలని చూడడం, ఆంక్షలు విధించడం తగదని మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆరోపించారు. బుధవారం అనకాపల్లి నుంచి తాళ్లపాలెం వరకు రోడ్డు మార్గంలో వచ్చి పరిశీలన జరిపిన ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవడం, కార్యకర్తలను బెదిరించడం న్యాయమా అంటూ స్పీకర్ అయ్యన్నను ప్రశ్నించారు, వైసిపి కార్యకర్తలను పోలీసులు బెదిరించడం, సభా స్థలానికి రాకుండా ఆటో వాళ్ళను బెదిరించడం ప్రజలంతా గమనిస్తున్నారని, ఎన్ని ఆంక్షలు విధించినా జగన్ పర్యటన విజయవంతమౌతుందని స్పష్టం చేశారు.

జగన్ పర్యటన విజయవంతం చేయాలి

పరవాడ: రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, గురువారం నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి, జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు పైలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వైసిపి హయాంలో పేదవాడికి వైద్యం, విద్య అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలను ఈ రాష్ట్రానికి తీసుకువచ్చారని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పిపిపి విధానంలో ప్రైవేటుకు కట్టబెట్టాలని ప్రయత్నించడం దారుణమని అన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు విశాఖ విమానాశ్రయానికి జగన్ చేరుకొని, అక్కడి నుండి రోడ్డు మార్గంలో ఎన్ఎడీ, వేపగుంట, సరిపల్లి, అనకాపల్లి బైపాస్ హైవే మార్గంగా నర్సీపట్నం చేరుకొని, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా వేపగుంటలో జగన్‌కు ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని, వైసిపి శ్రేణులు పాల్గొని, జగన్ పర్యటనను విజయవంతం చేయాలని పైల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

అంగన్వాడీ భవనం నిర్మించరూ..

ప్రజాశక్తి- పరవాడ :మండలంలోని రామాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-2 భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ భవనం పూర్తిగా పాడవ్వడంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో లోపలంతా నీరుకారిపోతూ ప్రమాదభరితంగా ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయంలో ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వేదికపైకి మార్చి అక్కడ ఆరుబయటే తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. పరాయిపంచన అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, అక్కడ సరైన రక్షణ, భద్రత లేకపోవడంతో పిల్లలకు ఏమౌతుందోనని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రానికి స్థానిక ఉన్నతపాఠశాల సమీపంలో స్థలాన్ని కేటాయించి, అందులో కొత్త అంగన్వాడీ భవనాన్ని నిర్మించి వసతి కష్టాలకు విముక్తి కల్పించాలని అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులతోపాటు స్థానికులు వేడుకుంటున్నారు.



హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం

ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచి ప్రారంభం



ముత్తూట్ బ్రాంచ్ ప్రారంభిస్తున్న భరత్ కుమార్

ప్రజాశక్తి - కశింకోట : కశింకోటలో ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంకు బ్రాంచిని అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ జి వెంకటరావు, స్థానిక బ్రాంచి మేనేజర్ యల్లపు కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భరత్‌కుమార్ మాట్లాడుతూ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు మంజూరులో ముత్తూట్ ఫైనాన్స్ అందరికీ తెలిసిందేనని, స్థానిక వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, మళ్ల బుల్లిబాబు, ఎంపిపి కలగ గున్నయ్యనాయుడు వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతిశ్రీను, 80వ వార్డు ఇన్‌ఛార్జి కెఎం.నాయుడు, సోషల్ మీడియా అధ్యక్షులు కాండ్రేగుల శ్యామ్, జి. నూకరాజు, కిట్టు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-.అనకాపల్లి : జివిఎంసి 83వ వార్డు మిర్యాల కాలనీ 4వ వీధి, వేల్పుల వీధి శివాలయం వెనుక రూ.40లక్షల జివిఎంసి నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ, గతంలో ప్రతిపాదించిన పనులకు ఇపుడు నిధులు మంజూరు చేయడం, వార్డులో రహదారుల అభివృద్ధి పనులు చెయ్యడం సంతోషంగా ఉందన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు,ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మిగతా పనుల ఆమోదానికి సహకరించాలని కోరారు. యువజన విభాగం అధ్యక్షులు జాజుల రామేష్, కొణతాల మురళీకృష్ణ, నడిశెట్టి మధు, ఉగ్గిన అప్పారావు, బుద్ధ పెంటారావు, యల్లపు నానాజీ, బండి ఆనంద్, రేబాక స్వామి, నడిశెట్టి గోవింద, రెడ్డి చిన్న, వేల్పుల గణేష్, కారుకుండి కన్నబాబు, కొడుకుల సుబ్రహ్మణ్యం,ఇంజరాపు వెంకటరావు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

కేన్సర్ బాధితునికి రూ.25 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో జానకయ్యపేట గ్రామానికి చెందిన కురందాసు నానాజీ పేగు కేన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆ కుటుంబం సతమతమవుతుంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న నానాజీని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బుధవారం జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కురందాసు అప్పలరాజు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి దుర్మార్గం



నర్సీపట్నంలో నిరసన చేపడతున్న నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై చెప్పుతో దాడి చేయడం అన్యాయమని దళిత గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సీపట్నం అబీద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలియజేశారు. అనంతరం రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, దేశ అత్యున్నత న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సామాన్యులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వెనకబడిన వర్గాలపై మతోన్మాదుల దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు హరిప్రసాద్, రెల్లి హక్కుల పోరాట సమితి నాయకులు తలుపులు, లావరాజు, కెవిపిఎస్ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: సుప్రీం కోర్ట్ సిజెఐ గవాయ్ పై కోర్టులోనే దాడికి పాల్పడిన సుప్రీంకోర్టు న్యాయవాది పై తగు చర్యలు తీసుకోవాలని డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, దీనికి కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి పాలకులు కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, ప్రధాన కార్యదర్శి శివకుమార్ పినమలా, దక్షిణ ఇంచార్జి సూర్యనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి గౌతమ్, భీమిలి ఇంచార్జి సవరవిల్లి రామకృష్ణ, మైనార్టీ నాయకులు అర్షద్ భాష, మహిళా నాయకులు వరాలమ్మ, ఎస్సీ సెల్ నాయకులు పద్మిని, చంద్రశేఖర్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఆనంద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో నిరసన చేపడుతున్న నాయకులు

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- నక్కపల్లి: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో డి సీతారామరాజు, ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో జానకయ్యపేటలో బుధవారం ఇంటింటా చెత్త సేకరణ విధానాన్ని పర్యవేక్షించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. డ్రైనేజీలో క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురందాసు నాగ సత్యవాణి, సింహాచలం, కురుందాసు అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

జగన్ పర్యటనను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటనను అడ్డుకుంటామని వివిధ దళిత సంఘాలు బుధవారం మీడియా సమావేశంలో హెచ్చరించారు. ఈ సందర్భంగా దళిత సేవా పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు మాట్లాడుతూ, డాక్టర్ సుధాకర్ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. డాక్టర్ సుధాకర్‌ను అన్యాయంగా పొట్టను పెట్టుకున్నారన్నారు. నర్సీపట్నంలో అడుగు పెట్టే ముందు సుధాకర్ తల్లికి, వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆర్‌డిఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కెవి అల్లికానుడిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఈనెల 10న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహవసర, వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కశింకోట ఆపరేషన్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అందరూ సహరించాలని కోరారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ



వడ్డిస్తున్న సత్యారావు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురం లలితా దేవి వృద్ధాశ్రమంలో వి ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ధ్యాన శిబిరంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని బ్రహ్మర్షి పిరమిడ్ సుభాష్ పత్రీజీ, టీం సభ్యులు,వి.ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఉదయం అల్పాహారం అందించారు. అనంతరం, సుభాష్ పత్రీజీ పిరమిడ్ టీంలోని మాస్టర్ జి.ఎస్.ఎన్. మూర్తి, "ధ్యానం, శ్వాసపై ధ్యాస" అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ జి.ఎస్.ఎన్. మూర్తిని, టీంసభ్యులు నాయుడు, వి.ఎస్.ఆర్. ట్రస్ట్ చైర్మన్ వడ్డీ సత్యారావు, టీం సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



వ్యాస రచనను పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, ప్రిన్సిపల్ శ్రీదేవి ఈ పోటీలను పర్యవేక్షించారు. జీఎస్టీ తగ్గింపు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డిఇఒ చలపతిరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన సిడిపిఒ

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 11వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గొలుగొండ మండలం చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సీడీపీఓ శ్రీగౌరి బుధవారం సందర్శించారు. అనంతరం విద్యార్థినీలతో సమావేశమయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం చోద్యం, ఏఎల్.పురం అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు.



మాట్లాడుతున్న సిడిపిఒ



దుస్తులు పంపిణీ చేస్తున్న నరేష్, కామేశ్వరరావు

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-వడ్డాది: గ్రామీణ వైద్యులలో పేరు ప్రఖ్యాతలు గాంచిన వడ్డాది డాక్టర్ సుభాకర్ 89వ జయంతి వేడుకలు అతిథిదేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వడ్డాదిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డాది టిడిపి టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్ మాట్లాడుతూ, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు. వైద్యం అందించడంలో సేవలు అందించారన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి వెంకటరావు, ముత్యాల సూరిబాబు, అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం రామారావు

ప్రజాశక్తి-రావికమతం : మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహిత విద్యా విభాగం స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బొడ్డు మహాలక్ష్మి నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు అధ్యక్షతన ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ డే (మస్తిష్క పక్షవాత దినోత్సవం) సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు మాట్లాడుతూ, సెరిబ్రల్ పాల్సీ వైకల్యం బారిన పడకుండా ఉండేందుకు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సెరిబ్రల్ పాల్సీ వైకల్యం గర్భిణీలకు ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు, అకాల ప్రసవాలు, చిన్నప్పుడే మెదడులో నరాలు దెబ్బ తినడం, ప్రసవ సమయంలో మెదడుకు సరిపోయే ఆక్సిజన్ అందకపోవడం, మేనరిక వివాహాలతో ఈ వైకల్యం సంభవిస్తుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ ఈ సెరిబ్రల్ పాల్సీ వైకల్యానికి గురైన వ్యక్తులు కూర్చోవడం, పాకడం, నడవడంలో ఇబ్బంది పడతారని తెలిపారు. ప్రాథమిక దశలోనే వీరిని గుర్తించి తగిన వైద్య సహాయంతో పాటు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ వంటివి అందించడంతో కొంతమేర సాధారణ స్థితికి తీసుకురావచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-మాడుగుల: ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థలో పని చేస్తున్న గొర్లి వరలక్ష్మి ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ కోటిని జయమ్మ సన్యాసినాయుడు ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రకృతి ఆధారిత కాషాయాలు, ద్రావణాలు తయారు చేయనున్నారు ప్రకృతి ఆధారిత ద్రావణాలను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనాద్ జగ్గారావు, వైస్ ప్రెసిడెంట్ దోడ్డి నారాయణరావు, సెక్రటరీ,షేక్ హుస్సేన్, ప్రకతి వ్యవసాయ మండల ఇన్చార్జి,గండి శ్రీనివాస్ ,యునిట్ ఇన్చార్జి సన్యాసి రావు,గోర్లి మణికంఠ పాల్గొన్నారు.



ద్రావణం డబ్బాను ఇస్తున్న సర్పంచ్

బల్క్ డ్రగ్‌తో మత్స్యకారుల జీవితాలు నాశనం

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 25 వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను నాశనం చేయొద్దన్నారు. ఇప్పటికే హెటిరో కంపెనీ వ్యర్ధ రసాయన జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించి పోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామన్నారు. కంపెనీ కాలుష్యం కారణంగా అనేక రకాల వ్యాధులు బారిన పడి ఇబ్బందులు పడుతున్నామని, క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడి ఇప్పటికే అనేకమంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికి, ఉపాధికి ప్రమాదం వాటిల్లుతుందని, ప్రభుత్వం తమ జీవన విధానాన్ని దష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.బాబ్జి, ఏపీ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్ర శేఖర్, నాయకులు సత్తిబాబు, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, నానాజీ, సోమేష్, మహేష్, అప్పలరాజు, సూరి, కాశీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా నాగజ్యోతి

ప్రజాశక్తి-రోలుగుంట:కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్(ఎన్‌పిఎఫ్), కర్ణాకట స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్(ఆర్ఏడబ్ల్యూ) సంయుక్తంగా ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో బెంగుళూరులో నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్స్ 2025 పోటీలు నిర్వహించ నున్నారు. ఈ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్, టీన్ బాయ్స్, గర్ల్స్, జూనియర్ బాయ్స్, గర్ల్స్, సీనియర్ మెన్, ఉమెన్, మాస్టర్స్ విభాగాలలో పోటీలు జరగనున్నాయి. ఈ జాతీయ స్థాయి పోటీలకు మ్యాచ్ రిఫరీగా రోలుగుంట జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు పివిఎం.నాగజ్యోతి నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్(ఎన్‌పిఎఫ్) తరపున ఎంపికయ్యారు. ఇప్పటికే నాగజ్యోతి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ కాంపిటీషన్లలో పాల్గొని అనేక పతకాలు సాధించారు. క్రీడల పట్ల ఆమె చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదల యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా పలువురు క్రీడాభిమానులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.


నాగజ్యోతి


సత్తిబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

పిఎసిఎస్ అధ్యక్షునిగా సత్తిబాబు

ప్రజాశక్తి-వడ్డాది:బుచ్చయ్యపేట మండలం పొట్టి దొరపాలెం పిఎసిఎస్ అధ్యక్షుడిగా విరోధి సత్తిబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు పూలమాలవేసి అభినందించారు. బుచ్చయ్య పేటలో ఆరు కోపరేటివ్ సొసైటీలలో గత నెలలోనే అధ్యక్షులను నియమించారు. పొట్టిదొరపాలెం, వడ్డాది కోపరేటివ్ అధ్యక్షుల నియామకం మాత్రం వాయిదా పడింది. ఈ సందర్భంగా కోఆపరేటివ్ అధ్యక్షులు సత్తిబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే రాజుకు ధన్యవాదాలు తెలిపారు. కోపరేటివ్ సొసైటీని అభివృద్ధి చేసి పాడి రైతుల అభ్యున్నతిఇక కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గొకివాడ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



450 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని జాలంపల్లి పంచాయతీ శివారు రాయిపాలెం వద్ద నున్న పెద్దేరు జలాశయం ప్రస్తుతం నీటి మట్టం 136.55 మీటర్లు ఉందని జలాశయం పర్యవేక్షణ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. దీంతో 450 క్యూసెక్కులు నీటిని స్పిల్వే గేటు ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఈ - పంట నమోదుకు 25వరకు గడువు

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ పంట నమోదుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. గొలుగొండ మండలం కొత్తమల్లంపేట రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం మండలంలో గల రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట ఉన్న ప్రతి రైతు ఖచ్చితంగా ఈ పంట నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, ఇతర అన్ని రకాల పంటలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, పురుగులపై అప్రమత్తంగా ఉండి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ అందుబాటులో ఉండాలని తెలిపారు. మండల పరిధిలోని ఎరువుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎరువులు, పురుగు మందులు మోతాదుకి మించి ఇవ్వవద్దని తెలిపారు. రైతుల విస్తీర్ణం బట్టి, తెగుళ్లు, పురుగులు నిర్ధారించి సరైన పురుగు మందులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.


నమోదును పరిశీలిస్తున్న మోహనరావు

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ యు. విమలకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి రావు ఈ కార్యక్రమానికి హాజరై మహిళా కార్యదర్శులతో పాటు అంగన్వాడీ కార్యకర్తలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమమునకు హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే. ధర్మారావు మాట్లాడుతూ, కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధించిన అంశాల పై సూచనలు ఇచ్చారు.యాప్లకు నమోదు, అపార్ ఐడి, నెట్వర్క్ సమస్యల పై వివరించారు.

పిజిఆర్ఎస్ అర్జీలన్నీ ఆన్‌లైన్ చేయాలి

◆ రెవెన్యూ అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : డివిజను, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్.) కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రశీదు అందించాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో పిజిఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్సిసి., ఐవిఆర్ఎస్, నీటితీరువా, కోర్టు కేసులు, సివిల్ సప్లయి, స్మార్ట్ కార్డు పంపిణీ, ఆర్ఒఆర్ కోర్టు, దీపం-2 పథకం రీ పేమెంటు, ఓటరు మ్యాపింగు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ, ఐవిఆర్ఎస్‌లో రెవిన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. డివిజను, మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్. కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేయాలని, వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి, అర్జీదారునితో అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు., అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీ పరిష్కారవిధానం ఉండాలన్నారు.
ప్రభుత్వ భూముల సర్వే చేయాలని, ఎక్కడైనా ఆక్రమణలను గుర్తిస్తే నోటీసులు అందజేయాలన్నారు. మండల స్థాయి సమన్వయ కమిటీకి సిఫార్సు చేసిన సివిల్ కేసులను శతశాతం పరిష్కరించేలా కృషిచేయాలని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య సివిల్ తగాదాలకు వారికి కౌన్సిలింగు నిర్వహించి, పరిష్కారం చూపాలని తెలిపారు. నీటితీరువా వసూలు పెంచాలని, నిర్దేశించిన మొత్తాలను వసూలు చేయాలన్నారు. కోర్టు కేసులు పూర్తిచేయాలని, ప్రతి శనివారం ఆర్ఒఆర్ కోర్టు నిర్వహించాలని సూచించారు. రీ సర్వేకు సంబంధించి మొదటి విడత సర్వే పూర్తయిందని, రెండవ విడత సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరించి పూర్తిచేయాలని, మూడవ విడతలో రీ సర్వే మొదలు పెట్టిన 30 గ్రామాలలో ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలన్నారు. రికార్డు శుద్దీకరణ చేయాలని సూచించారు.. పౌర సరఫరాల శాఖకు సంబంధించి రేషను షాపులు, బియ్యం బిల్లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తహశీల్దార్లు, సివిల సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రేషను స్మార్ట్ కార్డులు శతశాతం పంపిణీ పూర్తిచేయాలన్నారు. దీపం పథకానికి సంబంధించి ఎవరికైనా రీపేమెంటులో సమస్య వచ్చినట్లయిన, వెంటనే పరిష్కరించి లబ్దిదారులందరికీ డబ్బులు వారి అకౌంటులో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలకు సంబంధించి ఓటరు వెరిఫికేషను పూర్తి చేసిన పిదప, ప్రతి ఓటరు మ్యాపింగు చేయాలని తెలిపారు. ఫారం 6 దరఖాస్తులు పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, డిఆర్ఒ వై. సత్యనారా యణ రావు, ఆర్‌డిఒలు వివిరమణ, షేక్ ఆయిషా, డిఎస్ఒ మూర్తి, సర్వే సహాయ సంచాలకులు గోపాలరాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.


అవిశ్వాసానికి మద్దతు ప్రకటిస్తున్న ఎంపిటిసిలు

ఎంపిపిపై అవిశ్వాసానికి మద్దతు

◆ ముగ్గురు మహిళా ఎంపిటిసిల స్పష్టీకరణ

ప్రజాశక్తి - యలమంచిలి : జనసేన పార్టీ చిత్తశుద్ధిని నమ్మి ఎంపిపిపై అవిశ్వాసంలో ఆ పార్టీకి మద్ధతిస్తున్నామని మెజార్టీ ఎంపిటిసిలు స్పష్టం చేశారు. రాజాన శేషగిరిరావు నేతృత్వంలో ముగ్గురు ఎంపిటిసిలు జనసేన పార్టీకి మద్దతునిస్తూ, ప్రస్తుత ఎంపిపి బోదెపు గోవిందరావుపై అవిశ్వాస నోటీసు ఇచ్చామే తప్ప, ఎటువంటి ప్రలోభాలకు లొంగి కాదని స్పష్టం చేశారు. బుధవారం ప్రజాశక్తికి పంపిన ఇచ్చిన ప్రకటనలో రాజాన సూర్యచంద్ర శేషగిరిరావుకు తాము మద్దతునిస్తున్నట్లు శిలపరశెట్టి ఉమా గణేష్, నగిరెడ్డి అమ్మాజీ ఏటికొప్పాక, బర్రే శివలక్ష్మి కొత్తలి వెల్లడించారు.. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నాయకత్వంలో రాజాన శేషగిరిరావును ఎంపిపిగా చూడాలన్న కోరికతోనే అవిశ్వాస నోటీసు ఇచ్చామన్నారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో తమపై లేనిపోని ఆరోపణలు చేసిన ఎంపిపి గోవిందరావు మరో పది రోజుల్లో పదవీచ్యుతులను చేస్తామన్నారు. పార్టీ కంటే పదవి ముఖ్యం కాదన్న బోదెపు గోవింద్, పాలకవర్గంలో మెజార్టీ లేనప్పటికీ ఎంపిపిగా ఎందుకు కొనసాగుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.